క్లుప్తంగా

అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపిక


శశిధర్

మహబూబాబాద్ అర్బన్: వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు మహబూబాబాద్ జిల్లా నుంచి ఇద్దరు ఎంపికైనట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు బి.అజయ్‌సారథిరెడ్డి సోమవారం తెలిపారు. తొర్రూరు మండలం అమ్మపురం గ్రామానికి చెందిన అనురాగ్, జిల్లా కేంద్రానికి చెందిన కిన్నెర శశిధర్ ఎంపికయ్యారు. జిల్లా క్రీడాకారులు హర్షం వ్యక్త చేస్తున్నారు.

లైబ్రరీ సైన్స్‌లో అవార్డు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గంథ్రాలయ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న డి.రాజశేఖర్‌కు లైబ్రరీసైన్స్ విభాగంలో ద్రవిడ విశ్వవిద్యాలయంలో సర్వే ఆన్ కలెక్షన్ డెవలప్‌మెంట్ ఆఫ్ న్యాక్ అక్రిడిటెడ్ కాకతీయ యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్రం అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసి అవార్డును దక్కించుకున్నాడు.

కలెక్టర్‌కు వినతి

మహబూబాబాద్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాప్ సర్వే చేయడంలో అనేక సమస్యలు ఉన్నాయని సర్వే చేయడం సాధ్యం కాదని టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు. టీఎన్జీఓఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కొండ్లె ఉషస్విని రాష్ట్రస్థాయి యువజనోత్సవాల పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం, సీరోలు మండల విద్యాధికారి ఇస్లావత్ లచ్చిరాంనాయక్ తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

డోర్నకల్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు కోసం అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ధారావత్ శ్రీనివాస నాయక్ సోమవారం తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు అక్టోబర్ 1నుంచి నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కులవివక్ష నిర్మూలనకు ఉద్యమిద్దాం

నెహ్రూసెంటర్: దేశంలోని కుల వివక్ష నిర్మూలన కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.మధార్ అన్నారు. మహాత్మజ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పూలే విగ్రహానికి సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌కె బాబన్న, షర్ఫుద్దీన్, ఉపేందర్, భాస్కర్‌రెడ్డి, బానోత్ దేవేందర్ పాల్గొన్నారు.

టీ సేఫ్ యాప్‌పై అవగాహన

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని పులిపాటి ప్రసాద్ ఒకేషనల్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు షీటీం పోలీసు బృందం టీ సేఫ్ యాప్, మహిళా భద్రత, ర్యాగింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీం ఎస్సై సునంద, ఏఎస్సై ఆనందం, అరుణ, పార్వతి, రమేశ్ పాల్గొన్నారు.

సన్మానం



మహబూబాబాద్ రూరల్: పదవీ విరమణ పొందిన పోలీస్ కానిస్టేబుల్ బాలరాజును జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య పాల్గొన్నారు.

తెలంగాణ గ్రాంట్ పొందిన ఓయూ పూర్వ విద్యార్థులు

నెల్లికుదురు: టీస్పార్క్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ గ్రాంట్‌ను ఉస్మానియా పూర్వ విద్యార్థులు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన డాక్టర్ గాజుల ప్రభాకర్ (పీహెచ్‌డీ ప్లాంట్ సైన్స్), డోర్నకల్‌కు చెందిన డాక్టర్ పాపతోటి నరేంద్ర (పీహెచ్‌డీ మైక్రోబయాలజీ) పొందారు. ప్రభాకర్, నరేంద్రకుమార్ ఇద్దరు కలిసి మామిడి, మిరప పంటలకు నల్లతామర పురుగు నివారణ మీద రైతులు పడుతున్న ఇబ్బందుల మీద వీరు చేసిన పరిశోధనలకు న్యూఢిల్లీలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్స్ అసిస్టెన్స్ కౌన్సిల్ (బీఐఆర్ఏ) వారు రూ.50 లక్షల గ్రాంట్‌ను అందించారు.

నెట్టుకొస్తున్నారు..

- బాధ్యతలు ఎక్కువ.. జీతాలు తక్కువ
- భద్రతాలేని ఉద్యోగం
- అంగన్‌వాడీల గోడు వినేదెవరు?

పెద్దవంగర: పల్స్‌పోలియో చుక్కలు వేయాలన్నా.. ఓటరు నమోదు చేయాలన్నా.. గర్భిణులను బాలింతలను గుర్తించాలన్నా.. పిల్లలను బడిబాట పట్టించాలన్నా.. ఇలా అన్నింటికి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలే దిక్కు. కాని వారికి చెల్లిస్తున్న వేతనం చూస్తే చాలా తక్కువ. ఉద్యోగ భద్రత కూడా అంతంత మాత్రమే. కనీసం పదవీ విరమణ అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల్లాగా పింఛన్ లేదు. పోని పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తారా అంటే అదీ లేదు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రంలోనే ఉంటూ చిన్నారులకు సేవలు అందిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్‌కు నెలకు రూ.13,650, ఆయాకు రూ.7,800 మాత్రమే వేతనం చెల్లిస్తున్నారు.

మండలంలో 42 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో అద్దె భవనాల్లో 09, ఇతర భవనాల్లో 21, సొంత భవనాల్లో 12 మాత్రమే కొనసాగుతున్నాయి. మండలంలో అంగన్‌వాడీ టీచర్లు 37


బీసీ తండాలో పాఠశాల వంటగదిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం


బొమ్మకల్లులో పోషణ అభియాన్ (ఫైల్)

ఆయాలు 25 సేవలందిస్తున్నారు. పలు కేంద్రాల్లో ఆయాలు లేని చోట టీచర్లకు రెట్టింపు భారం పడుతోంది. మరికొన్ని కేంద్రాల్లో ఇన్‌చార్జ్ టీచర్లతోనే అంగన్‌వాడీ కేంద్రాలను నెట్టుకొస్తున్నారు. చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు గ్యాస్ బిల్లులు, కూరగాయల బిల్లులు, ప్రతి నెలలో చేపట్టే ఈవెంట్స్ నిర్వహణ ఖర్చులు, టీఏ, డీఏలు ఏవి కూడా అందించడంలేదు. దీంతో పని భారంతో పాటు ఆర్థిక భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె భవనాలల్లో నడుస్తున్న బడులకు అద్దెలు ఆలస్యమైన వారు ఇబ్బందులకు గురి అవుతున్నారు. అద్దె భవనాలు ఇరుకు గదుల్లో నడుస్తుండంతో కేంద్రాలకు చిన్నారులను పంపించడానికి తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు.

సొంత భవనాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం..



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్థల పరిశీలన చేస్తున్నాం. నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

- ఐసీడీఎస్ సూపర్ వైజర్, శోభ, పెద్దవంగర

పేదలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు


కురవి: మాట్లాడుతున్న శ్రీనివాస్

కురవి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని, పేదలను విస్మరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం తట్టుపల్లి గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ 10వ మహాసభ కొల్లూరు సత్యం, నక్క ఉప్పలయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సైదులు, కోటయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

పోరాటాలు చేయడమే సీపీఎం ధ్యేయం

గార్ల: దేశంలో పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ, ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడమే సీపీఎం ధ్యేయం అని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని సీతంపేట పంచాయతీలో జరిగిన పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీతంపేట గ్రామశాఖ కార్యదర్శిగా ధరావత్ కైబాబు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గడ్డిపాటి రాజారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, హరి, సత్యవతి పాల్గొన్నారు.

ఎర్రజెండా స్ఫూర్తితో ఉద్యమించాలి


మాట్లాడుతున్న సోమయ్య

నెహ్రూసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పేదలకు అండగా ఎర్రజెండా స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని హన్మంతునిగడ్డలో పార్టీశాఖ మహాసభ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు నిర్వహించే సీపీఎం బలోపేతం కోసం కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, నాయకులు నాగన్న, మోహన్‌రావు, బిక్షపతి, వెంకట్రావు, బస్వయ్య, సారంగం, రామ్మూర్తి, రాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది


కురవి: వెంకన్నను సన్మానిస్తున్న సంఘం నాయకులు


గార్ల: రత్నకుమార్‌కు సన్మానం..

కురవి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని రాజోలు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న పల్ల వెంకన్న పదవీ విరమణ సన్మాన సభ స్కూల్ హెచ్‌ఎం రవికుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, మండల అధ్యక్షుడు నిమ్మ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి.వెంకటేష్, రాష్ట్ర బాధ్యులు పెరుమాళ్ల రామూర్తి, కె.వెంకటరెడి పాల్గొన్నారు.

గార్ల: గార్ల బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి సోమవారం పదవీ విరమణ పొందిన రత్నకుమార్‌ను సన్మానించారు. టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.శివనాయక్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు అల్లి ఉప్పలయ్య పదవీ విరమణ పొందారు. సోమవారం ఉప్పలయ్య దంపతులను ఉపాధ్యాయ బృందం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరయ్య, ఉపాధ్యాయులు గోవర్ధన్, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రామోహన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

కేసముద్రం: ప్రతీ ఒక్కరు తమ వృత్తిలో అంకితభావంతో పనిచేస్తే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని కల్వల మోడల్‌స్కూల్‌లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సోమవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్, పిచ్చయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

డోర్నకల్: డోర్నకల్ మండలం చాప్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని దారావత్ తండాకు చెందిన దారావత్ రవి(53) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండెకరాల భూమిలో వ్యవసాయ చేస్తున్న రవి ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య చిల్కి పొలం వద్ద వెళ్లి చూడగా భర్త పురుగు మందు తాగి పడిపోయి ఉన్నాడు. మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిస కావడం తోపాటు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో రవి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: ఆగి ఉన్న టిప్పరును ఢీకొని ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన వెల్ది నరేష్ పట్టణంలోని జేవీ గ్రాఫిక్స్ కంప్యూటర్ ప్రింటింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. తన పని పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో నరేష్ తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా శనిగపురం గ్రామ శివారులో ప్రధాన రహదారి పక్కనే టిప్పర్ ఆగి ఉన్న విషయాన్ని గుర్తించలేదు. ద్విచక్ర వాహనం అక్కడికి చేరుకునే క్రమంలో ఒక్కసారిగా అదుపుతప్పి టిప్పరును వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనగా జరిగిన ప్రమాదంలో నరేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన వాహనదారులు ఆటోలో అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్సై దీపిక ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

యువకులది సాధారణ మరణమే..

నర్సింహులపేట: మండలంలోని రామన్నగూడెంలో జూన్ 10వ తేదీన మిత్రుల పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని ముగ్గురు అస్వస్థతకు గురై ఇద్దరు యువకులు బోగోజ్ శ్రవణ్, ఎస్‌కె.రహీం మృతి చెందిన ఘటనలో వారి మృతి సర్వసాధారణమని ఎస్సై సురేష్ తెలిపారు. ఇద్దరు యువకుల మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. ఫోరెన్సిక్ రిపోర్టులో ఎలాంటి విషపూరిత పదార్థాలు లేవని, వారి మరణం సాధారణ మరణాలుగా నిర్ధారించి నివేదిక ఇచ్చినట్లు సోమవారం ఎస్సై తెలిపారు.

పోషణ వారోత్సవాలు

గార్ల: గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి సూచించారు. సోమవారం మండలంలోని రాంపురం గ్రామంలో పోషణ వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు నిర్వహించిన సీమంతాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంపూర్ణ, పద్మ, సుజాత, సరిత, శ్రీలక్ష్మి, కనకతార పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి జెడ్పీహైస్కూల్‌ను ఎంఈఓ కాలేరు యాదగిరి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంఈఓను పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 10/10 గ్రేడ్ సాధించిన విద్యార్థులకు రూ.1,016ల బహుమతి ఇస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోట కనకయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గోపి, కృష్ణ, జావేద్, భార్గవి, ఫహీం, వీరస్వామి, పీఈటీ నసీరుద్దీన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు శిక్షణ

డోర్నకల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వంద రోజులు ఉపాధి పనులు పూర్తి చేసిన కుటుంబాలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ, ఈజీఎంఎం, కేవీకే మల్యాల ఆధ్వర్యంలో యూఎన్ఎన్ఏటీఐ ప్రాజెక్ట్ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా 2018 నుంచి 2024 వరకు వందరోజుల ఉపాధి పనులు పూర్తి చేసిన 19నుంచి 45 సంవత్సరాల వారిని గుర్తించి శిక్షణకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ మాలతి, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, ఎంపీఓ మీర్జా మున్వర్‌బేగ్, ఏపీఓ పార్థసారథి, ఏపీఎం శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు


చిన్నగూడూరు: సమర్థ విద్యానికేతన్ పాఠశాలలో..


కేసముద్రం: డిగ్రీ కాలేజీలో..


డోర్నకల్: కస్తూర్బా పాఠశాలలో..


తొర్రూరులో..

జిల్లా వ్యాప్తంగా సోమవారం పలు పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ సందడి చేశారు. సంస్కృతి సంప్రదాయాలను గుర్తు చేసేలా పండుగ వాతావరణం నెలకొంది.

- సాక్షి నెట్‌వర్క్


దంతాలపల్లి: పెద్దముప్పారం ఏకశిలా పాఠశాలలో..

50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పిస్తామని, గూడూరు సీహెచ్‌సీని 50పడకల ఆస్పత్రిగా మారుస్తానని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సోమవారం సీహెచ్‌సీ రేడియోగ్రాఫర్ వెంకటేశ్వర్లు అభ్యర్థన మేరకు, నెక్కొండ మండలం పత్తిపాకకు చెందిన సంపత్‌రెడ్డి ఇతర రాష్ట్రంలో ఐఏఎస్‌గా పనిచేస్తున్న తన కూతురు శ్యారెడ్డి సహకారంతో అందించిన రూ.13లక్షలు ఖరీదైన డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అవసరమైన వైద్యుల నియామకం జరిగేలా చూస్తానన్నారు. అనంతరం జిల్లా సూపరింటెండెంట్ వెంకట్రాములు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వీరన్న 30 పడకల ఆస్పత్రిని 50పడకల ఆస్పత్రిగా మార్చి, అవసరమైన వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, బీరం శ్రీపాల్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలు, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న రామ్మూర్తి

మహబూబాబాద్ రూరల్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుడ్డెల రామ్మూర్తి అన్నారు. మండలంలోని మల్యాల గ్రామ సీపీఎం శాఖ 7వ మహాసభ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ.. సమాజ మార్పునకు కమ్యూనిస్టులు అవసరమన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఎం పోరాటాలు చేస్తుందని, సంక్షేమ పథకాలు అమలు విషయంలో అలసత్వం వహించవద్దన్నారు. కార్యక్రమంలో జటంగి లచ్చయ్య, బల్లెం మల్లయ్య కోడిదల రాములు, చేపూరి గణేష్, చంద నరసింహరావు, యాకూబ్, జటంగి గోవర్ధన్, దుండి రాములు, జలక మల్లయ్య, విక్రం, మునేందర్, మహేష్ పాల్గొన్నారు అనంతరం సీపీఎం నూతన గ్రామ కమిటీని ఎన్నిక నిర్వహించి చంద నరసింహారావును ఎన్నుకున్నారు.

సంక్షిప్త సమాచారం

ఉత్సవాలను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కేవీపీఎస్ 26 వసంతాల ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాలను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 2నుంచి 5వ తేదీ వరకు జిల్లా, మండల, గ్రామ కేంద్రాల్లో కేవీపీఎస్ జెండాలను ఎగురవేస్తూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

తొర్రూరు రూరల్: మండలంలోని పోలెపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు భోజన ప్లేట్లు బహూకరించారు. గ్రామానికి చెందిన పులి స్వరూప జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు వితరణ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భీమా, ఉపాధ్యాయులు స్వాతి, సుమలత పాల్గొన్నారు.

'చలో నిదానపురానికి' తరలిరావాలి

దంతాలపల్లి: మండలంలోని నిదానపురం గ్రామంలో మాదిగల భూవిషయంలో వారికి జరుగుతున్న అన్యాయాలపై చలో నిదానపురం కార్యక్రమం నిర్వహించనునట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చాగంటి రమేష్ మాదిగ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పోలెపాక ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

పెద్దవంగర: పొదుపు సంఘాల ద్వారా మహిళలకు ప్రభుత్వం అందించే తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ వారి సమన్వయంతో సోమవారం మండల కేంద్రంలోని శ్రీతులసి మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా పాడి పశువులు, పౌల్ట్రీ మదర్‌యూనిట్‌తో పాటు పెరటికోళ్ల పెంపకంపై లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఐక్యంగా పోరాడాలి

బయ్యారం: సమస్యల పరిష్కారానికి హమాలీ కార్మికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ పిలుపునిచ్చారు. సోమవారం బయ్యారంలో నిర్వహించిన మహాసభల్లో ఆయన మాట్లాడారు. అనంతరం బయ్యారం శాఖ కార్యదర్శిగా పతంగి పురుషోత్తం, కారుకొండ కార్యదర్శిగా బాణోత్ శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

తొర్రూరు: ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ శాంతికుమార్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సేఫ్టీ మోకుపై శిక్షణ

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి, కల్వల గ్రామాల్లో గీతకార్మికులకు కాటమయ్య రక్షణ సేఫ్టీ మోకుతో ఎక్సైజ్ సీఐ భిక్షపతి, ఎస్సై రాజేశ్వరి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, కోఆర్డినేటర్ గౌని వెంకన్న, ఉపాధ్యక్షుడు మోడెం వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు ఉప్పలయ్య, సొసైటీ అధ్యక్షుడు గంధం వెంకన్న పాల్గొన్నారు.

డీఈగా పదోన్నతి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో ఏఈగా పని చేస్తున్న బోడ సురేష్‌కు డీఈగా పదోన్నతి వచ్చింది. జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపాలిటీకి డీఈగా బదిలీ అయ్యారు.

శంకర్ మృతి తీరనిలోటు

మహబూబాబాద్ రూరల్: నిబద్ధత గల ఉపాధ్యాయుడు బొడ్డుపల్లి శంకర్ అకాల మృతి విద్యార్థులకు తీరనిలోటు అని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. శంకర్ సంతాప సభ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో డోలి సత్యనారాయణ, బొడ్డుపల్లి శంకర్, బలాష్టి రమేష్, సోమ విష్ణువర్ధన్, సువర్ణ, అంజయ్య, రామలింగారెడ్డి, ఉపేందర్, హెచ్‌ఎం భద్రు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


అధ్యక్ష, కార్యదర్శులు

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో జరిగిన 11వ మండల మహాసభలో టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం జిల్లా కార్యదర్శి నామా వెంకటేశ్వర్లు, ఆడిట్ కమిటీ సభ్యుడు వివేక్ కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్, కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా గ్రేసమ్మ, ఎస్‌కె అమీన్, కార్యదర్శులుగా కోట వెంకన్న, లక్ష్మీప్రసాద్, వరలక్ష్మి, సీతారాములు, చంద్రశేఖర్, అనూష ఎన్నికయ్యారు.

వృత్తి నైపుణ్యంపై శిక్షణ

డోర్నకల్: లేబర్ కార్డులు కలిగిన ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు, తాపీమేస్త్రీలకు అమ్మపాలెం రైతువేదికలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో లేబర్ కార్డు కలిగిన వారికి ఆధునిక భవన నిర్మాణ సాంకేతిక అంశాలపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీఓ మీర్జా మున్వర్ బేగ్ శిక్షణలో పాల్గొన్న వారికి సేఫ్టీ హెల్మెట్లు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరుణాకర్, దేవేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కురవి: మండలంలోని నేరడ శివారు చంద్రు తండాకు చెందిన గిరిజన మహిళ మౌనిక గత ఏడాది మృతి చెందింది. దీంతో అనాథగా మారిన పిల్లల గురించి తెలుసుకున్న యూ ట్యూబర్ గంగరబోయిన రఘు సోమవారం ఎస్ఆర్ఐ చందు సోదరి సౌజన్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బాధిత కుటుంబానికి ఇంటికి తలుపు, ఫ్యాన్, ప్లేట్స్ అందజేశారు.

గార్ల: మండలంలో ఇటీవల పిడుగుపాటుకు, విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన అల్లం ప్రవీణ్ కుటుంబానికి రూ.5వేల, గూగులోత్ నితిన్ కుటుంబానికి రూ.3వేల నగదును పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ సోమవారం అందజేశారు.

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామానికి చెందిన గణపారపు ప్రభాకర్ అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.5వేలు, 50కేజీల బియ్యాన్ని సోమవారం అందజేశారు.

సభ్యత్వ నమోదు

చిన్నగూడూరు: మండల కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమంను మండల అధ్యక్షుడు జక్కి నాగేశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. తహసీల్దార్ మహబూబ్ అలీ, సీఐ రాజ్‌కుమార్, ఎస్సై ఝాన్సీ, ఎంఈఓ రవికుమార్ జనవిజ్ఞాన వేదిక సభ్యత్వాన్ని నమోదు చేసి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో దయానంద్, చక్రధర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై దాడి

నెల్లికుదురు: ఓ మహిళా టీచర్‌పై ప్రభుత్వ ఉపాధ్యాయుడి బంధువులు సోమవారం దాడి చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మహిళా టీచర్ విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి బంధువులు మహిళా టీచర్‌పై దాడికి పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరిని అక్కడ నుంచి చెదరగొట్టారు. ఉపాధ్యాయుడు మహిళా టీచర్‌తో సన్నిహితంగా ఉంటున్నందుకు ఉపాధ్యాయుడి బంధువులు టీచర్‌పై దాడికి పాల్పడి ఉంటారని సమాచారం.